## రథయాత్ర.. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి



అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని హౌసింగ్‌ బోర్డు కాలనీలో ఆదివారం ప్రారంభం కానున్న పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా కాలనీలను శుభ్రంగా ఉంచాలని సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ అధికారులను డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌ రెడ్డి కోరారు. మంగళవారం హౌసింగ్‌ బోర్డు కాలనీ, బృందావన్‌ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 రోజుల పాటు పూరీ జగన్నాథ రథయాత్ర జరుగుతుందని, అందులో భాగంగా అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. శానిటేషన్‌ సిబ్బంది ప్రతి రోజు రోడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రాత్రి సమయంలో స్ట్రీట్‌ లైట్లు వెలిగేలా చూడాలని విద్యుత్‌ సిబ్బందిని కోరారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాహుల్‌, మున్న, సరోజ్‌, గిరిధర్‌, శంకర్‌, శ్రీనివాస్‌ రెడ్డి ఉన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



రాఘవయ్యను సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందని జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌ అన్నారు. జిన్నారం మండలంలోని చెట్లపోతారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవయ్య మంగళవారం పదవీ విరమణ పొందాడు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్‌, మాజీ సర్పంచ్‌ ప్రకాశ్‌చారిలతో పాటు తోటి ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు రాఘవయ్య దంపతులను సన్మానించారు.

## నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి:కొండాపూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌ స్తంభాలను మార్చడానికి బుధవారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు శిల్పారామం, సీజీఎస్‌ ఇండియా ప్రధాన రోడ్డు, సైబర్‌వ్యాలీ(శిల్పారామం ఎదురు)లో విద్యుత్‌ ఉండదన్నారు.

## రాంగ్‌రూట్‌.. 10 బైక్‌లు సీజ్‌

గచ్చిబౌలి: రాంగ్‌రూట్లో వెళుతున్న బైకులను సీజ్‌ చేసినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ వెంకన్న తెలిపారు. మంగళవారం బయోడైవర్సిటీ పార్కు కూడలి నుంచి దివ్యశ్రీ ఐటీ సంస్థ రూట్లో రాంగ్‌రూట్లో వెళుతున్న బైక్‌ రైడర్లపై బీఎన్‌ఎస్‌ చట్టంలోని సెక్షన్‌ 125 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

## రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి



కూకట్‌పల్లి హైటెన్షన్‌ ఏరియాలో డ్రైనేజీ, రోడ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కూకట్‌పల్లి హైటెన్షన్‌ రోడ్డు వద్ద డ్రైనేజీ, రోడ్ల పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని శానిటేషన్‌, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పలు కాలనీల అసోసియేషన్‌ అధ్యక్షులు, స్థానిక ప్రజలు ఫిర్యాదులను ఎమ్మెల్యే కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ చెరువులలో గుర్రపుడెక్క ఎక్కువగా ఉండటం వల్ల దోమల సమస్య ఎక్కువ అవుతుందని ఎంటమాలజి విభాగంలో ఎక్కువ సిబ్బంది హాజరవుతున్నట్లు చూపెడుతూ పనులు చేయటంలో తక్కువ సిబ్బంది హాజరవుతున్నారని తన దృష్టికి వచ్చిందని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు రానున్న ఆషాడ బోనాలను దృష్టిలో ఉంచుకొని దేవాలయాల వద్ద డ్రైనేజీ పనులు, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, వాటర్‌వర్క్స్‌ అధికారులు, ఎలక్ట్రికల్‌ అధికారులు, డివిజన్‌ అధ్యక్షులు సంతోష్‌, ప్రభాకర్‌, బొట్టు విష్ణు,తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలి



ఎంఏనగర్‌ బస్తీవాసులతో మాట్లాడుతున్న రవికుమార్‌ యాదవ్‌

> జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌

మియాపూర్‌: మియాపూర్‌ ఎంఏనగర్‌ కాలనీలో నివాసం ఉంటున్న వారికి హెచ్‌ఎండీఏ అధికారులు ఇస్తున్న నోటీసులను ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌ అన్నారు. మియపూర్‌ ఎంఏనగర్‌ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం ఆయన పర్యటించారు. అనంతరం నోటీసులు ఇచ్చిన కుటుంబాలతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మియాపూర్‌ ప్రభుత్వ భూముల్లో గత 30 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పరుచుకుని ముజఫర్‌ అహ్మద్‌నగర్‌లో ఉంటున్న పేద ప్రజలకు గత నెల 27 నుండి హెచ్‌ఎండీఏ అధికారులు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఏనగర్‌ కాలనీ బస్తీలో ఏ ఒక్క ఇల్లు కూల్చకుండా భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు మాన్యం, రవికాంత్‌, శ్రీను, అయ్యన్న, నాయకులు లక్ష్మణ్‌, రాజేష్‌గౌడ్‌, గణేష్‌, శివారెడ్డి, రాము ఉన్నారు.

## దృష్టిలోపం ఉన్న వారికి చేయూత అందించాలి



నిర్వాహకులతో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌

రాయదుర్గం: దృష్టిలోపం ఉన్న వారికి చేయూత అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌ అన్నారు.హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో మంగళవారం ఆయన ఫ్రీడమ్‌ హెల్దీ కుకింగ్‌ ఆయిల్స్‌ ఆధ్వర్యంలో 'డైలాగ్‌ ఇన్‌ ది డార్క్‌' పేరిట ప్రత్యేక ప్రదర్శన, దివ్యాంగుల సామర్థ్యాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చూపు లేని వారికి వినికిడి, వాసన గమనించడం, రుచి, స్పర్శ ద్వారా వారి పని తీరు మనకంటే రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందన్నారు. 12 ఏళ్లుగా క్రమం తప్పకుండా డైలాగ్‌ ఇన్‌ ద డార్క్‌ పేరిట సమావేశాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫ్రీడమ్స్‌ హెల్దీ కుకింగ్‌ ఆయిల్స్‌ తయారీదారులు, జెమినీ ఎడిబుల్స్‌, ఫ్యాట్స్‌ ఇండియా లిమిటెడ్‌ గ్రూప్‌ ఉపాధ్యక్షుడు అక్షయ్‌చౌదరి మాట్లాడుతూ డైలాగ్‌ ఇన్‌ ది డార్క్‌ కార్యక్రమం ద్వారా టీహబ్‌తో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. జెమిని ఎడిబుల్స్‌, ఫ్యాట్స్‌ ఇండియా లిమిటెడ్‌ సేల్స్‌, మార్కెటింగ్‌ సీనియర్‌ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వ్యక్తుల కోణం నుంచి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి సమాజానికి ఒక అవకాశాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, బిజినెస్‌ లీడర్లు, డీఈఐహెడ్‌లు, హెచ్‌ఆర్‌ ప్రాక్టీషనర్లు పాల్గొన్నారు.

# నిర్వహణేది..?



పిచ్చిమొక్కలతో నిండిన మయూరినగర్‌ పార్కు






నిర్వహణ లోపం, నిర్లక్ష్యంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి చెత్తచెదారంతో స్థానికులు పార్కులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రతిఏటా లక్షల రూపాయల నిధులు పార్కుల నిర్వహణ, అభివృద్ధి కోసం కేటాయిస్తున్నా పార్కుల రూపురేఖలు మాత్రం మారడం లేదు. మియాపూర్‌లోని మయూరినగర్‌ కాలనీలో ఓ పార్కుకు ఏపీజే అబ్దుల్‌ కలాం ట్రీ పార్క్‌ అని పేరు పెట్టి అభివృద్ధి చేశారు. వాకింగ్‌ట్రాక్‌, బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పార్కును ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో కళావిహీనంగా మారింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. దీంతో పార్కులోకి రావడానికి జనాలు జంకుతున్నారు. చెట్ల మధ్యలో, వాకింగ్‌ ట్రాక్‌ పక్కన పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో చిన్నపాటి అడవిని తలపిస్తుందని వాపోతున్నారు. పార్కు గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. – మియాపూర్‌

## వినికిడి యంత్రాలు అందజేత



పరికరాలను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలోని ఆస్బెస్టాస్‌ కాలనీకి చెందిన ధనుంజయ్‌రావు కుమారుడు దేవర సుబ్రహ్మణేశ్వర్‌రావు, కుమార్తె దేవర మనిత్వతలకు వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే గాంధీ అందజేశారు.వైద్య చికిత్స నిమిత్తం వారు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 1,60,000 లక్ష రూపాయల విలువ గల వినికిడి యంత్ర పరికరాలను మంగళవారం అందజేశారు.

## బ్రిలియస్‌ టెక్నాలజీస్‌ వార్షికోత్సవం



గచ్చిబౌలి: క్లౌడ్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ టెక్నాలజీలో రాణిస్తున్నామని బ్రిలియస్‌ టెక్నాలజీస్‌ సీఈఓ రామ నరేష్‌ దండా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని బ్రిలియస్‌ టెక్నాలజీస్‌లో పదవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎన్‌సీ కంపెనీలకు డెవ్‌ అప్స్‌, క్లౌడ్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌, బ్లాక్‌ చైన్‌లపై సేవలందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళామందిర్‌ సిల్క్‌ గ్రూపు చైర్మన్‌ ప్రసాద్‌ చలవాది, బ్రిలియస్‌ వైస్‌ప్రెసిడెంట్‌ ప్రవీణ్‌ మద్దిపట్ల, డైరెక్టర్‌ గురు కొమ్మినేని పాల్గొన్నారు.

## కార్పొరేటర్‌ పర్యటన

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌ఫేజ్‌–2లో 40 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని రోడ్డుపై వర్షం నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్‌, అగ్రవాసు, సంగమేష్‌, మోజెస్‌, శ్రీనివాస్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.



పీజేఆర్‌ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌

## ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

> నార్సింగి మున్సిపల్‌ కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్‌ కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్‌ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్‌, ఆరోగ్య శాఖల అధికారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అలర్జీలు, అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందని వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో సంపూర్ణ పారిశుద్ధ్యం అమలు చేయాలన్నారు. నీటిని కాచి వడపోసి తాగాలని ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి శ్రీనివాస్‌, ఎంపీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్‌, మున్సిపల్‌ మేనేజర్‌ యోగేష్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకరించండి



జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డిని శేరిలింగంపల్లి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ కలిశారు. మంగళవారం వెస్ట్‌జోన్‌ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్‌ అభివృద్ధికి సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. మాజీ కౌన్సిలర్‌ మోహన్‌గౌడ్‌, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## పుష్పయాగం



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్‌ చెరువు సమీపంలోని రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. గరుడ ప్రసాదం పంపిణీ, చక్రతీర్థం, పుష్పయాగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం తులసి దళార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## సమయపాలన పాటించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లలిత సోమిరెడ్డి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్‌ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ సంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



భవనాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్‌, కమిషనర్‌, కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నార్సింగి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌, కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం వారు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఖానాపూర్‌లో కౌన్సిలర్‌ జి.అమరేందర్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ, మూత్రశాలలు, అంగన్‌వాడీ పాఠశాల, కమ్యూనిటీహాల్‌ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. నాసిరకం పనులు చేసే కాంట్రాక్టర్‌లపై చర్యలు తప్పవన్నారు. అనంతరం పారిశుద్ధ్య పనులను పరిశీలించి వార్డు పరిధిలో ఎక్కడా చెత్త కనపడకూడదని ఆదేశించారు. గ్రామంలో ఉన్న బుల్కాపూర్‌ నాలాను పరిరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్‌ ఇంచార్జి లచ్చిరాం, ఇంజనీరింగ్‌ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌లు, కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మంజుల

హఫీజ్‌పేట్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో తప్పకుండా నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌ పరిధిలోని ఇందిరానగర్‌లో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌ పరిధిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు సన్మానం




డాక్టర్‌ చందర్‌ను సన్మానిస్తున్న కొండ విజయ్‌కుమార్‌

శేరిలింగంపల్లి: లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లో మంగళవారం డాక్టర్స్‌ డేను ఘనంగా నిర్వహించారు. మెడికల్‌ ఆఫీసర్‌ డా.చందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్‌ క్లబ్‌ రీజియన్‌ చైర్మన్‌ కరుణాకర్‌గౌడ్‌ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవలు అందించే వైద్యులను గౌరవించడం బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ జోన్‌ చైర్మన్‌ కొండ విజయ్‌ కుమార్‌, లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ శేరిలింగంపల్లి అధ్యక్షులు ప్రసాద్‌, కార్యదర్శి లక్ష్మీనారాయణ గౌడ్‌, కోశాధికారి జనార్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్‌, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిదిమందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 09 మందికి జరిమాన, ముగ్గురికి జరిమానాతో పాటు, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 09 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా, ఒకరికి ఒక రోజు,మరో ఇద్దరికి రెండు రోజుల జైలుతోపాటు, రూ. రెండు వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



మేయర్‌ నీలాగోపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తానని మేయర్‌ కొలను నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతినగర్‌లోని రెండవ డివిజన్‌ కార్పొరేటర్‌ చిట్ల దివాకర్‌ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ , శ్రీరంగాస్‌ నందనం, శ్రీ నిలయం కాలనీల ప్రజలకు మేయర్‌ను కలిశారు. తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు పలు సమస్యలపై మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు వంటి పనులపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామన్నారు.

## కంకర క్రషర్లపై చర్యలు తీసుకోండి

ఆర్డీఓకు మాదారం నాయకుల వినతి



ఆర్డీఓకు సమస్యను వివరిస్తున్న మాజీ సర్పంచ్‌ సురేందర్‌గౌడ్‌

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో ఉన్న కంకర క్రషర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ క్రషర్‌లను మూసి వేయించేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మాదారం గ్రామ నాయకులు, ప్రజలు ఆర్డీఓ వసంతకుమారికి వినతి పత్రాన్ని అందించారు. లీజ్‌ గడువు ముగిసినా కూడా రెండు క్రషర్‌ల నిర్వహణ జోరుగా సాగుతుందని నాయకులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై తక్షణమే విచారణ జరపాలని ఆర్డీఓ వసంత కుమారి సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం వావిలాల, బొల్లారం గ్రామాల్లో ఆర్డీఓ పర్యటించి పలు భూములను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్‌ బిక్షపతి, మాజీ సర్పంచ్‌ సురేందర్‌గౌడ్‌, నాయకులు విజయ్‌గౌడ్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా.. మహా జనసభ



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ ఆదేశాల మేరకు తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల రైతువేదికలో తెల్లాపూర్‌ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతు భరోసా పథకంపై ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా సహకార సంఘం అధికారి ప్రసాద్‌ పాల్గొన్నారు. సభలో రైతులు వారి అభిప్రాయాలు తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ 20 ఎకరాల వరకు రైతు భరోసా డబ్బులు చెల్లించాలన్నారు. మరి కొంతమంది రైతులు 5ఎకరాల వరకే భరోసా డబ్బులు చెల్లించాలని అవి కూడా సకాలంలో చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు చెల్లించరాదని, వ్యవసాయ పనిముట్లు, గేదెలు, ఆవులు, కోళ్ల పెంపకానికి 75శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు సునీల్‌, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, వ్యవసాయాధికారి శ్రీహరిలు పాల్గొన్నారు.